కాలనీ అభివృద్ధికి సహకారం

నిజాంపేట్ : ఎన్‌టీఆర్ నగర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు శుక్రవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడుకొలను శ్రీనివాస్‌రెడ్డితో సమావేశమయ్యారు. కాలనీలోని వివిధ సమస్యలను కాలనీ వాసులు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఏనుగుల శ్రీకాంత్‌రెడ్డి, ఏనుగుల మధుసూదన్‌రెడ్డి, శ్రీహర్ష ఆమంచి, ఎన్‌టీఆర్ నగర్ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు రెడ్డిపల్లి సుధాకర్, కమిటీ సభ్యులు బూసాల ఉదయ్ కుమార్, బైపునేని మోహన్, కాలప్ప, లక్ష్మి, దేవరాజు, కాలిమా, కోటేష్ యాదవ్, భానుప్రసాద్, చారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించిన ఆర్ఐ


స్కూల్ యాజమాన్యంతో మాట్లాడుతున్న ఆర్ఐ నరేందర్‌రెడ్డి

నిజాంపేట్ : బాచుపల్లిలోని సర్వే నంబర్ 301 ప్రభుత్వ భూమిని శుక్రవారం ఆర్ఐ నరేందర్‌రెడ్డి పరిశీలించారు. వికాస్ స్కూల్‌కు సంబంధించిన వాహనాలను అక్రమంగా ప్రభుత్వ స్థలంలో పార్కింగ్ చేస్తున్నారని బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన తహసీల్దార్ పూల్‌సింగ్ విచారణ చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఇది ప్రభుత్వ స్థలమని, వెంటనే ఖాళీ చేయాలని స్కూల్ యాజమాన్యానికి సూచించారు.

వీర సైనికులకు ఘన నివాళి


నివాళి అర్పిస్తున్న బీజేపీ శ్రేణులు

నిజాంపేట్ : పుల్వామా ఉగ్రదాడిలో మరణించిన వీర సైనికులకు శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నిజాంపేట్ అధ్యక్షుడు భిక్షపతియాదవ్ మాట్లాడుతూ.. సైనికుల వీర మరణం వృథా కాదన్నారు. దేశ రక్షణ కోసం యువత నడుం బిగించాలన్నారు. కార్యక్రమంలో బాచుపల్లి అధ్యక్షులు ప్రసాద్‌రాజు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి దాసి నాగరాజు, సచిన్, వెంకటేష్, రాజేష్, సిద్ధు, వింగ్ కమాండర్ వైఎస్ ప్రసాద్, కిరణ్, జలపతి గౌడ్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

రొమ్ము కేన్సర్ ఉచిత స్క్రీనింగ్ శిబిరం


కార్యక్రమంలో పాల్గొన్న ఏఐజీ ఆసుపత్రి సిబ్బంది

దుండిగల్: గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్, ఏఐజీ ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం దుండిగల్ మున్సిపల్ 27వ వార్డులోని తండాలో రొమ్ము కేన్సర్ ఉచిత స్క్రీనింగ్, అవగాహన సదస్సును నిర్వహించారు. డాక్టర్లు ప్రజ్ఞ చిరుగుపాటి తమ బృందం సభ్యులతో మహిళలకు పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రజ్ఞ మాట్లాడుతూ.. మారిన ఆహారపు అలవాట్లు, జీవన శైలితో మహిళలకు రొమ్ము కేన్సర్లు వస్తున్నాయని, 40 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళా విధిగా పరీక్షలు చేయించుకుని జాగ్రత్త పడాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్, గ్రాన్యూల్స్ ఇండియా ప్రతినిదులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ తృతీయ బ్రహ్మోత్సవాలు


ఆలయంలో యజ్ఞం నిర్వహిస్తున్న వేద పండితులు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్‌లోని పద్మావతి గోదాదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ తృతీయ బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం 8 గంటలకు యాగశాలలో ద్వారతోరణం, ధ్వజకుంభారాధన, మూర్తి కుంభారాధన, అగ్ని ప్రతిష్ఠ, చతుస్థానార్చన, మూలమంత్ర హవనం, గరుడ హవనం, నిత్య పూర్ణాహుతి, ధ్వజారోహణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ నెల 18వ తేదీ వరకు ఆలయ బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి.


గంపలబస్తీ వ్యూ

రసాయనాలా ఘాటు!

గంపలబస్తీలో జనావాసాల మధ్యే దందా

> జీడిమెట్ల పారిశ్రామికవాడ రసాయనాల నిల్వలకు అడ్డాగా మారింది. రసాయనాల డ్రమ్ములు కడిగి ఆ నీటిని నాలాలోకి వదులుతుండటంతో నాలా నుంచి వచ్చే ఘాటైన వాసనలతో జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఒక్క దానికి కూడా ప్రభుత్వ అనుమతి ఉండదు. జన ఆవాసాల మధ్యే ఇదంతా జరుగుతున్నా అధికారులు అటు వైపు కన్నెతి చూడటం లేదన్న విమర్శలు ఉన్నాయి. మాముళ్ల మత్తులో ఉండటం వల్లే అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- విచ్చలవిడిగా రసాయనాల పారబోత
- ఘాటు వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

జీడిమెట్ల: గంపలబస్తీలో స్క్రాప్‌గోదాములు, రసాయన డ్రమ్ములు, కవర్లు కడిగే వ్యాపారాలు, తుక్కు, ప్లాస్టిక్ పరిశ్రమలు కనిపిస్తాయి. ఎక్కడ చూసినా చెత్తాచెదారాలను తలపించే పాత రసాయన డ్రమ్ములు, కవర్లు కుప్పలుగా కనిపిస్తాయి. అక్కడ గాలిపీలిస్తే కేవలం రసాయనాల ఘాటైన వాసన వస్తుంది. దీనిని బట్టే అర్థం చేసుకోవచ్చు ఇక్కడ రసాయనాలు ఎంతమేరకు పారబోస్తారో అని. వ్యాపారానికి కరెంట్ అవసరం లేదు. రసాయనాలు పారబోయడానికి పక్కన నాలా ఉంటే చాలు. ఈ ఒక్క గంపలబస్తీలో జరిగే వ్యాపారం వల్ల చుట్టు పక్కల ఉన్న సుభాష్‌నగర్, వినాయకనగర్, చింతల్, కుత్బుల్లాపూర్ గ్రామాల ప్రజలు ఘాటైన రసాయనాల వాసనలు పీల్చుకోవాల్సి వస్తుంది.

విచ్చలవిడిగా రసాయనాల పారబోత

నాలాకు ఆనుకుని వ్యాపార కార్యకలాపాలు కొనసాగుతాయి. రసాయన డ్రమ్ములు, కవర్లను కడిగి పక్కనే ఉన్న నాలాల్లో రసాయనాలను పారబోస్తారు. దీంతో చుట్టు పక్కల కాలనీలతో పాటు నాలా పొడవున ఘాటైన రసాయన వాసనలు వస్తుంటాయి. కొన్నిసార్లు ఘాటైన పొగలు సైతం గాల్లోకి వెలువడుతాయి. ఈ క్రమంలో ప్రజలు శ్వాస పీల్చడానికి కూడా నానా ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

గేటుకు తాళం వేసి..

దందా నిర్వహించే వారి స్టైలే వేరు. గేటుకు తాళం ఉంటుంది. కానీ లోపల కార్యకలాపాలు మాత్రం నడుస్తూనే ఉంటాయి. ఎవరైనా వచ్చి చూస్తే ఎలాంటి పనులు జరగడం లేదని, తాళం వేసి ఉందని చూసి వెళ్లిపోతారు. ఇదే అధికారులకు సాకుగా మారింది. ఎప్పుడైనా ప్రజల నుంచి ఒత్తిడి వచ్చినపుడు మాత్రమే అధికారులు నామమాత్రపు తనిఖీలు నిర్వహిస్తారు. అది కూడా తాము చూసినప్పుడు తాళం వేసి ఉందని, నోటీసులు ఇస్తామని అంటూ మరిచిపోతారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని జనావాసాల మధ్య ప్రజలకు హానీ కలిగించే వ్యాపారాలను ఇక్కడ నుంచి తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారుల చర్యలు శూన్యం

రసాయనాల ఘాటు వల్ల స్థానిక ప్రజలు పడే ఇబ్బందులు అధికారులకు తెలుసు. తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అటు వైపు కన్నెతి కూడా చూడటం లేదన్న విమర్శలు ఉన్నాయి. మున్సిపల్, పీసీబీ, రెవెన్యూ అధికారులు వ్యాపారులు ఇచ్చే మాముళ్ల మత్తులో చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.


నాలా పక్కనే రసాయన కవర్లు కడుగుతూ ..

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

నిజాంపేట్ : బాచుపల్లి ప్రాంతంలో హెచ్‌టీఎఫ్ఏ టీం పోలీసులు గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. బాచుపల్లికి చెందిన సందీప్, రాజమండ్రికి చెందిన రామిరెడ్డి బాచుపల్లిలో గంజాయి అమ్ముతున్నారు. పోలీసులు వారి నుంచి 1.1 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. టూ వీలర్, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు టీం లీడర్ నంద్యాల అంజి రెడ్డి తెలిపారు. వారిని కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు


పూజలో పాల్గొన్న ప్రతాప్ తదితరులు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ గ్రామంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు హోమం బలిహరణం, స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. మాజీ డీసీసీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఠాగూర్ రాజేందర్ సింగ్, ఠాకూర్ విజయేందర్ సింగ్, నార్లకంటి శ్యామ్, కుంట వేణు ముదిరాజ్, రత్నం కిరణ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

జగద్గిరిగుట్ట: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శనివారం సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జగద్గిరిగుట్ట సెక్షన్ ఏఈ రాధాకిషన్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ షిరిడీ హిల్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంటల వరకు రాజీవ్ హిల్స్, షిరిడీ హిల్స్, భూదేవి హిల్స్, కూన మహాలక్ష్మి నగర్, అంజయ్యనగర్ బ్లాక్‌-సి, 11కేవీ జగద్గిరిగుట్ట ఫీడర్ పరిధిలో జగద్గిరిగుట్ట, బీరప్పనగర్, అంజయ్యనగర్, మైసమ్మనగర్, సోమయ్యనగర్ తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

కమ్యూనిటీహాల్ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలి

నిజాంపేట్ : నిజాంపేట్ జర్నలిస్టు కాలనీలో నివాసం ఉంటున్న స్థానికులకు సామాజిక అవసరాలకు స్థలాన్ని కేటాయించాలని శుక్రవారం జర్నలిస్టు కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాచుపల్లి తహసీల్దార్ పూల్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. 2007 సంవత్సరంలో నాటి ప్రభుత్వం విలేకరులకు సర్వే నంబర్ 334 నిజాంపేట్‌లో లే అవుట్ చేసి స్థలాలను ఇచ్చిందన్నారు. నాడు స్థలాలు ఇచ్చి ఇండ్లు నిర్మించుకోవడానికి అవకాశం కల్పించిన ప్రభుత్వం కాలనీ సామాజిక అవసరాలకు స్థలం కేటాయించలేదని వివరించారు. కావున కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మారుతి సాగర్, శ్రీనివాస్, దేవేందర్ గుప్తా, గోవిందరావు, జీతయ్య పాల్గొన్నారు.

దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలి

కూకట్‌పల్లి: రంగారెడ్డి జిల్లా కోర్టు హాల్‌లో న్యాయమూర్తిపై దాడిని నిరసిస్తూ కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి శుక్రవారం నిరసన తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు నటరాజు, ప్రధాన కార్యదర్శి తాండ్ర రమేష్ గౌడ్, జాయింట్ సెక్రటరీ యాదయ్య, కోశాధికారి ఖలీల్ పాషా, మహిళా ప్రతినిధి సదాలక్ష్మి, కార్యవర్గ సభ్యులు ప్రవీణ్‌రెడ్డి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు అర్చన, ప్రకాష్‌రావు, శ్రీనివాస్ రెడ్డి, జాకీర్ హుస్సేన్, అఖిలేషన్, సీనియర్ న్యాయవాది కేసాని సురేష్ బాబు, శేఖర్‌బాబు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం

-ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: సీఎంఆర్‌ఎఫ్ ద్వారా పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందుతుందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీకి చెందిన ఎల్ నాగలక్ష్మి, ఎండీ ఫజల్‌కు ఎల్‌ఓసీ చెక్కులను శుక్రవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, నేతలు సురేష్‌రెడ్డి, రుద్రా అశోక్, వేణు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి కృషి చేయాలి

కుత్బుల్లాపూర్ గార్డెన్ బస్తీ, జగద్గిరిగుట్ట డివిజన్ సంజయ్‌పురి కాలనీల నూతన కమిటీ సభ్యులు వివేకానంద్‌ను కలిశారు. కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించి మాట్లాడారు. కాలనీ అభివృద్ధికి అందరు కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. తమ వంతు సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం నేతలు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి నిరుడు రాజేష్, ఉపాధ్యక్షుడు అనిల్ కుమార్, శారద, కార్యనిర్వాహక అధ్యక్షురాలు సీహెచ్ దివ్య, సంజయ్‌గాంధీ నగర్ అధ్యక్షులు అరుణ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శౌకత్ పాషా, సభ్యులు రాములు, అనిల్, అరవింద్, ప్రదీప్, సురేష్, రాజు, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.


ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

లీకేజీతో తాగునీరు వృథా



చింతల్: కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా తయారైంది కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ అధికారుల పనితీరు. జగద్గిరిగుట్ట నుంచి బాలనగర్‌లోని ఎన్‌ఆర్‌ఐ, హెచ్ఏఎల్ తదితర ప్రాంతాలకు వెళ్లే 800 ఎంఎం డయా పైపులైన్‌కు మూడు నెలల క్రితం లీకేజీ ఏర్పడింది. టీకెంసీ, డీమార్ట్ మధ్యలో ఉన్న రోడ్డు వద్ద ఛాంబర్‌లో లీకేజీ ఏర్పడడంతో ఈ నీరంతా డిమార్ట్ నుంచి సౌభాగ్యనగర్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వరకు వచ్చి నాలాలో కలుస్తున్నాయి. పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టేందుకు సీజీఎం కార్యాలయం నుంచి నిధుల కోసం ఇక్కడ అధికారులు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. భారీ పైపులైన్ కావడంతో తమ పరిధిలో మరమ్మతులకు అయ్యే నిధులు లేవంటూ ఉన్నతాధికారులకు నివేదించినా అక్కడ నుంచి కూడా సరైన స్పందన లేదు. దీంతో మూడు నెలలుగా తాగునీరు రోడ్డుపై వృథాగా పారుతుంది. మరమ్మతుల చేపట్టాలంటూ స్థానిక కాంట్రాక్టర్‌ను ఆదేశించడంతో అక్కడ కొంతమేర తవ్వకాలు చేపట్టాడు. సదరు పనులకు జలమండలి సీజీఎం, విద్యుత్ శాఖల నుంచి అనుమతులు ఉంటేనే మరమ్మతులకు చేపట్టే అవకాశం ఉందని కాంట్రాక్టర్ తెగేసి చెప్పినట్లు సమాచారం. ఈ పైపులైన్ శిథిలావస్థకు చేరడంతో ఐడీపీఎల్ సిగ్నల్ నుంచి హెచ్ఏఎల్, ఎన్ఆర్ఐసీ తదితర ప్రాంతాలకు నూతన పైపులైన్ పనులు దాదాపు 90 శాతం పూర్తి చేశారు. మరో 10 శాతం మేరకు విద్యుత్ శాఖ ఆర్‌అండ్‌బీ, జీహెచ్ఎంసీ విభాగాల నుండి అనుమతులు రాకపోవడంతో పైపులైన్ పనులు నిలిచిపోయాయి.

మూడు నెలలుగా పట్టించుకోని అధికారులు

రోడ్డు విస్తరణ సరే.. స్తంభాలు తొలగించరా?

రంగారెడ్డినగర్: అధికారుల నిర్లక్ష్యంతో రోడ్డు వెడల్పు చేసినా వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. షాపూర్‌నగర్ చౌరస్తా, రంగ భుజంగ చౌరస్తాలను సుమారు రూ. 60 లక్షల నిధులతో విస్తరించారు. అయితే అధికారులు పనులు ప్రారంభించక ముందే రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలను తరలించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. దీంతో కాంట్రాక్టర్ తన పనులు పూర్తి చేశాడు. షాపూర్‌నగర్ హమాలీ అడ్డా సమీపంలో రోడ్డు విస్తరించినా అడ్డుగా విద్యుత్ స్తంభాలు దర్శనిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో స్తంభాలను తొలగించక పోవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. లక్షలాది నిధులు వెచ్చించినా తమకు వెతలు తప్పడం లేదని వాహనదారులు వాపోతున్నారు.


షాపూర్‌నగర్ హమాలీ అడ్డా సమీపంలో రాకపోకలకు ఆటంకంగా మారిన స్తంభాలు

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం


మోహన్

కుత్బుల్లాపూర్: మతిస్థిమితం సరిగా లేని వ్యక్తి అదృశ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ పరమేశ్వర్‌రెడ్డి వివరాల ప్రకారం.. చింతల్ దత్తాత్రేయనగర్ కాలనీకి చెందిన జొన్నాడ మోహన్(26)కు మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఇంటి పట్టునే ఉంటున్నాడు. ఈ నెల 8వ తేదీన సాయంత్రం 5 గంటలకు ఇంట్లో చెప్పా పెట్టకుండా వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు అతని జాడ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం పేట్‌బషీరాబాద్ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా లక్ష్మీ గణపతి ఆలయ ఉత్సవాలు



సుభాష్‌నగర్: సూరారం డివిజన్ వైష్ణవినగర్‌లో శుక్రవారం లక్ష్మీ గణపతి ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారుజామున 5 గంటలకు గోపూజ, వినాయకపూజతో ప్రారంభమైన పూజలు ఆదివారం 12 గంటలకి ఆశీర్వచనం, తీర్థప్రసాదం, అన్నప్రసాదం కార్యక్రమంతో ముగుస్తుందని దేవాదాయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వేమారెడ్డి, యాదిరెడ్డి, వెంకటనర్సయ్య, అప్పారావు, నరేందర్ రెడ్డి, నాగభూషణం, కాలనీ వాసులు పాల్గొన్నారు.

దరఖాస్తుల కోసం తిరగాల్సిందేనా!

- పథకాల కోసం కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్న అధికారులు
- తమ వద్ద కాదని తప్పించుకుంటున్న యంత్రాంగం
- సరైన సమాధానం చెప్పడం లేదని ప్రజల ఆగ్రహం



సర్కిల్ కార్యాలయం

కుత్బుల్లాపూర్ : ఇందిరమ్మ ఇల్లు.. రేషన్ కార్డుల దరఖాస్తులు.. వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పింఛన్లు.. ఉచిత కరెంటు లబ్ధిదారులు ఇలా చెప్పుకుంటూ పోతే ప్రభుత్వ పథకాలు అందాలంటే కాళ్ల చెప్పులు అరగాల్సిందే. మండల కార్యాలయం పోతే సర్కిల్ కార్యాలయానికి వెళ్లాలని.. సర్కిల్ కార్యాలయానికి వెళ్తే వార్డు కార్యాలయానికి వెళ్లాలని ఇలా అనేక రకాలుగా ప్రజలను అధికారులు నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ప్రజా పాలన పేరుతో దరఖాస్తులు తీసుకున్న అధికారులు.. ఆ తర్వాత సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించారు. ఇదిగో లబ్ధిదారుల ఎంపిక పూర్తైంది అని ఇక ఇల్లు కేటాయించడమే తరువాయి అన్నట్లుగా హడావుడి చేశారు. ఇదే క్రమంలో రేషన్ కార్డుల ప్రక్రియ ముందుకు వచ్చింది. ఆ తర్వాత డివిజన్ వారీగా వార్డు కార్యాలయంలో ఇందిరమ్మ ఇల్లు దరఖాస్తు చేసుకోవాలని మరో మారు ప్రకటన వెలువడింది. అంతేకాకుండా మీసేవా కేంద్రాల్లో రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించింది. ఇలా అనేక ప్రభుత్వ పథకాల విషయంలో ప్రజలు అయోమయానికి గురయ్యే విధంగా ప్రకటనలు వెలువడుతుండటంతో ఏమి చేయలేక ఆయా కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరుగుతూ విసుగెత్తిపోతున్నారు.

జంట సర్కిల్ కార్యాలయాలకు...

కుత్బుల్లాపూర్ గాజులరామారం జంట సర్కిల్ పరిధిలో మొత్తం ఎనిమిది డివిజన్‌లు ఉన్నాయి. ఆయా డివిజన్ల వారీగా ప్రజలు తమ దరఖాస్తుల పరిస్థితి ఏమిటని ఆరా తీసేందుకు ప్రతి రోజు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సరైన సమాధానం చెప్పే వారు లేక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సమయపాలన లేకుండా వస్తూ పోతుండటంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు సమీపంలో ఉన్న చెట్ల కింద కూర్చొని ఉదయం నుంచి సాయంత్రం వరకు వారి కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకవైపు ఇందిరమ్మ ఇల్లు, మరోవైపు రేషన్ కార్డుల ప్రక్రియ, ఇంకోవైపు ఉచిత కరెంటు విషయంపై పెద్ద ఎత్తున జంట సర్కిల్ కార్యాలయాలకు వచ్చి వెళ్తున్న సంఘటనలు ఉన్నాయి. వీరికి ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేసి వీరి సందేహాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఏ అధికారి సమాధానం ఇవ్వడం లేదు



ఇప్పటికే పలు మార్లు దరఖాస్తు చేసుకున్న. మా ఇంటి పక్కన ఉన్న వాళ్లం దరికీ ఉచిత విద్యుత్ వర్తిస్తుంది. ఒరిస్సా నుంచి వచ్చి ఇక్కడ 22 ఏళ్లుగా ఉంటున్నాం. 2016లో ఇంటి కోసం దరఖాస్తు చేసుకుంటే రాలేదు. ప్రజా పాలనలో మరోసారి దరఖాస్తు చేసుకుంటే ఇంతవరకు ఏ అధికారి విచారణ రాలేదు. అధికారులు సరైన సమాధానం చెప్పడం లేదు.

– జిల్లీ పాత్ర, షాపూర్ నగర్, హెచ్‌ఎంటీ సొసైటీ

అందుబాటులో ఉండటం లేదు



ఎన్నో ఏళ్ల నుంచి ఇంటి కోసం దరఖాస్తు చేసుకుంటున్నా.. ఇప్పటి వరకు నాకు అవకాశం దక్కలేదు. గత సంవత్సరం ప్రజాపాలనలో ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న. ఇప్పటి వరకు మా ఇంటికి ఏ ఒక్క అధికారి విచారణకు రాలేదు. తిరిగి డివిజన్ కార్యాలయంలో సైతం దరఖాస్తు చేసుకున్న. ఇంటికి వచ్చి సమగ్ర కుటుంబ సర్వే చేసినా తనకు ఇల్లు కేటాయించలేదు. ఇదే విషయాన్ని అధికారులను అడిగేందుకు వస్తే ఎవరూ రాలేదని చెబుతున్నారు.

– జి. శ్రీదేవి, సంజయ్ గాంధీ నగర్